
మినీ ఎయిర్‌టెక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మినీ ఎయిర్‌టెక్ వాహనం ప్రారంభం

సంతోష్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌కు నూతనంగా మంజూరు అయిన మినీ ఎయిర్‌టెక్ వాహనాన్ని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, జలమండలి అధికారులు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైదాబాద్ డివిజన్ ప్రజలకు మురుగునీటి కష్టాలను సత్వరమే తొలగించడానికి మినీ ఎయిర్‌టెక్ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కాలనీవాసుల కోరిక మేరకు మినీ ఎయిర్‌టెక్ వాహనం కేటాయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం షీలారాణి, సైదాబాద్ సెక్షన్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మనోహర్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు నవీన్, వనజ, విజయ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామంలోని సర్వే నంబర్ 386లోని ప్రభుత్వ భూమిలో వెలసిన నిర్మాణాన్ని జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాలతో గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ ఆర్ఐ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చివేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినా, కబ్జాకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రవీందర్‌దత్ హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


పసుమాముల ప్రభుత్వ భూమిలో వెలిసిన నిర్మాణాన్ని నేలమట్టం చేస్తున్న దృశ్యం

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

కొత్తపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లోని కమర్షియల్ ట్యాక్స్ కాలనీలో నూతన డ్రైనేజీ పైపుల ఏర్పాటుతో తరచూ తలెత్తే డ్రైనేజీ ఇబ్బందులు ఇక దూరమవుతాయని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. కాలనీలో రూ.7లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ పనులను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం కొత్తపేట గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, పనులను జలమండలి అధికారులు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు అరీఫ్, దయాకర్, నాయకులు సుందర్‌నారాయణ, అశ్విన్‌సింగ్, తిరుమల్, మహేందర్‌యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్‌బీనగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని హరిపురికాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశంగుప్తా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి గందె సురేష్, కోశాధికారి బిల్లకంటి కిరణ్‌కుమార్, అష్టలక్ష్మీ ఆలయం మాజీ చైర్మన్ బందం దామోదర్, ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆలయాల వార్షికోత్సవాలు

కొత్తపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని శబరి అయ్యప్పస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అర్చక స్వాములు శ్రీనివాస్, మహంకాళి రవి విశేష అలంకారాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా రుద్రహోమం చేశారు. శబరి అయ్యప్పస్వామి ఆలయం వద్ద విశేష దీపాలంకరణ చేశారు. అయ్యప్ప భజన పడి పూజ కార్యక్రమాలకు పరిసర కాలనీల భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ, కోశాధికారి హేమ సుందరరావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవి ఏర్పాట్లు చేశారు.


కార్ల్‌మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి

సంతోష్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక నాయకుడు కార్ల్‌మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా గురువారం సింగరేణి కాలనీలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐవైఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్, మహమూద్, జంగయ్య, ఏఐటీయూసీ హైదరాబాద్ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి దశరథనాయక్, అంజయ్య, సీపీఐ కార్యదర్శి యాదయ్య, అజీం, పాషా, చింటు, రాజు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్లెనిగల్స్ అవేర్ ఆస్పత్రిలో కిడ్నీ హెల్త్ ఫర్ ఆల్ పేరిట కిడ్నీ ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల అపరిశుభ్రత కిడ్నీ వ్యాధులకు కూడా దారి తీస్తుందన్నారు. ఈ సందర్భంగా యూరాలజిస్ట్, నెఫ్రాలజిస్టులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఓఓ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, వైద్యులు నవీన్‌కుమార్, వేణు మన్నే, ప్రభుచరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

పోలీస్ ఠాణాకు చేరిన మీర్‌పేట్ 'అవిశ్వాస' పంచాయితీ..!

● 'నమ్మక ద్రోహులు' అంటూ వీడియో పోస్ట్ చేసిన బీజేపీ కార్పొరేటర్

● చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఫిర్యాదు

సరూర్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ మేయర్‌పై అవిశ్వాసం పెట్టడం, అది వీగిపోవడం వరకు అంతా సాఫీగానే సాగగా.. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల కారణంగా ఈ వ్యవహారం కాస్తా పోలీస్‌స్టేషన్‌కు చేరింది. అవిశ్వాసానికి మద్దతిచ్చి, లేఖపై సంతకాలు పెట్టి చివరిదాకా తమతోనే ఉన్న ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు.. చివరి నిమిషంలో తమను మోసం చేశారని మేయర్ పదవి రేసులో ఉన్న బీజేపీ సభ్యురాలు నీలారవినాయక్ అదే రోజు ఆరోపించిన సంగతి విదితమే. దీనిపై ఆమె సదరు ముగ్గురు కార్పొరేటర్లతో ఓ వీడియో తయారు చేసి, దానికి ఓ పాట జోడించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. దాంతో తమ ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యవహరించిన నీలారవినాయక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సదరు ముగ్గురు కార్పొరేటర్లు బుధవారం బీఆర్ఎస్ మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, ఇతర కార్పొరేటర్లతో కలిసి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో అవిశ్వాసం పంచాయితీ ప్రస్తుతం పోలీస్‌స్టేషన్‌కు చేరినట్టయింది. తమను నమ్మించి మోసం చేశారంటూ సదరు ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్లను 'నమ్మక ద్రోహులు'గా పేర్కొంటూ సోషల్ మీడియాలో వీడియో వైరల్ చేయడంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇష్టం లేకుంటే తమకు మద్దతు ఇవ్వకపోయినా బాగుండేదని, కచ్చితంగా అవిశ్వాసానికి మద్దతిస్తామని నమ్మించి మరో క్యాంపులోకి వెళ్లిపోయారని నీలారవినాయక్ ఆరోపించారు.


మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మమతాప్రవీణ్, నవీన్‌గౌడ్

కఠిన చర్యలు తీసుకోవాలి..

తమపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్ట్ పెట్టి వైరల్ చేసిన నీలారవినాయక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు మమతా ప్రవీణ్, మేదరి సురేఖారమేశ్, ఉయ్యాల నవీన్‌గౌడ్ మీర్‌పేట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. తాము డబ్బు తీసుకుని మోసం చేసినట్టు ఆరోపించడం సరైందికాదని, తాము ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసం పని చేశామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి మాట్లాడుతూ డబ్బు ఇచ్చామంటూ బహిరంగంగా ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, దానికి సంబంధించిన ఆధారాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. డబ్బులతో రాజకీయం చేయాలనుకోవడం వారి అవివేకానికి నిదర్శనమని విమర్శించారు.

ముదురుతున్న వివాదం

మేయర్‌పై అవిశ్వాసం అంశం బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలకు దారి తీస్తోంది. మొన్నటిదాకా కలిసిమెలిసి ఉన్న ఆ పార్టీ సభ్యులు ప్రస్తుతం రెండు గ్రూపులుగా విడిపోయారు. ఓ వర్గం మేయర్‌పై అవిశ్వాసానికి మద్దతివ్వగా, మరోవర్గం వ్యతిరేకంగా పనిచేసింది. ఇందులో 'ఆర్థిక' అంశం కూడా ముడిపడి ఉండడంతో వివాదం మరింత ముదురుతోంది. తమను మోసం చేసిన ముగ్గురు సభ్యులు తమ వద్ద తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని అవిశ్వాసం పెట్టిన వర్గం సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలను సమయం వచ్చినప్పుడు బయటపెడతామని వారు స్పష్టం చేస్తున్నారు. మరోపక్క తాము ప్రలోభాలకు లొంగకుండా మాజీ మంత్రి సబితారెడ్డికి ఇచ్చిన మాట ప్రకారం పని చేశామని సదరు ముగ్గురు సభ్యులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య రాజకీయ వైరం మరింత ముదిరినట్టయింది. మున్ముందు ఇది ఎక్కడికి దారి తీస్తుందో అని ఆ పార్టీ నేతలు తల పట్టుకుంటున్నారు.


శిక్షణా శిబిరంలో క్యాబ్‌డ్రైవర్లు

పర్యాటక రంగంలో డ్రైవర్ల పాత్ర కీలకం

●టూరిజానికి బ్రాండ్ అంబాసిడర్లుగా క్యాబ్ డ్రైవర్లు

● ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ జయదేవ్

శంషాబాద్ రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో క్యాబ్ డ్రైవర్లది కీలక పాత్ర అని, టూరిజానికి వారు బ్రాండ్ అంబాసిడర్లు అని ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అతిథి దేవో భవ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది క్యాబ్‌డ్రైవర్లకు రెండు సెషన్లలో ప్రయాణికులు, పర్యాటకుల పట్ల పాటించే మర్యాదలు, పరిశుభ్రత, సీపీఆర్ తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జయదేవ్ మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే క్యాబ్/ఆటోడ్రైవర్ల పాత్ర చాలా కీలకమని అన్నారు. అతిథి దేవో భవ కార్యక్రమం కింద దాదాపు 200 మంది క్యాబ్ డ్రైవర్లకు శిక్షణ అందించినట్లు ఆయన తెలిపారు. క్యాబ్ డ్రైవర్లకు సీపీఆర్ కిట్లను అందజేశారు. టూరిజం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా, తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ, జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు, అపోలో హాస్పిటల్స్, కోఠారి గ్రూప్, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా, ఐఐహెచ్ఎం త్రిపుర కన్‌స్ట్రక్షన్ సంస్థల భాగస్వామ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు జయదేవ్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, జీఎంఆర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మహిళా విభాగం మీర్‌పేట్ అధ్యక్షురాలిగా సునీత

● నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే సబిత

సరూర్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మహిళా విభాగం మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షురాలిగా 9వ డివిజన్‌లోని నందిహిల్స్‌కు చెందిన జమాల్‌పూర్ సునీతాబాల్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం మీర్‌పేట్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఇంతకు ముందు మహిళా అధ్యక్షురాలిగా కొనసాగిన పద్మారెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సంగతి విదితమే. దాంతో ఆమె స్థానంలో నూతన అధ్యక్షురాలిగా సునీతను నియమించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాల ప్రకారం నడుచుకుంటూ పార్టీ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పార్టీ పటిష్ఠతకు తన వంతు కృషి చేస్తానని సునీతాబాల్‌రాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ నాయక్, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.


సునీతకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి


దిల్‌సుఖ్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయాన్ని గురువారం రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి సందర్శించి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిరిడీ సాయి సంస్థాన్ చైర్మన్ గుండా మల్లయ్య ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి జ్ఞాపికను అందజేశారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

భూదాన్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి

● సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌నాయక్

మన్సూరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణలకు గురికాకుండా ఉండాలంటే మరో భూదాన్ ఉద్యమానికి సిద్ధం కావాల్సిందేనని సర్వోదయ మండల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్ పేర్కొన్నారు. సర్వోదయ మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహా సభ గురువారం నాగోల్‌లో జరిగింది. సర్వోదయ మండలి జిల్లా అధ్యక్షుడు కె.చందు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌నాయక్ మాట్లాడుతూ రద్దు అయిన భూదాన్ బోర్డు పేరుతో ఆ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నాడని, గాంధీభవన్‌ను అడ్డాగా చేసుకొని భూదాన్ భూములతో అక్రమ వ్యాపారానికి తెరలేపాడని ఆరోపించారు. గున్న రాజేందర్‌రెడ్డిని గాంధీభవన్ నుంచి తరిమేసి అతనిపై సీఐడీ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భూదాన్, గ్రామదాన్ చట్టం 1965లో వచ్చిందని, తెలంగాణ రాష్ట్రం వచ్చాక దాన్ని రద్దు చేశారన్నారు. అయినప్పటికీ పాత తేదీలతో అమాయక ప్రజలకు ప్రొసీడింగ్స్ ఇస్తూ రాజేందర్‌రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. భూదాన్ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని, 1,79,000 ఎకరాల భూదాన్ భూముల లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం భూదాన్ భూమిఎంత ఉంది..? ప్రభుత్వం ఆధీనంలో ఉన్నదెంత..? పేదలకు పంపిణీ చేసిందెంత.? లెక్కలు తేల్చాలని, భూమిలేని, ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఆ భూములను పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సైదాభేగం, యాకుబ్ పాషా, ధనమ్మ, శ్రీనివాస్, ఆరెకంటి రాములు, మేడం రాజేశ్, కొమ్ము యాదగిరి, కమల, కొమ్ము రాములు, శ్రీనివాస్, షమీం, హేమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

పరీక్ష సామగ్రి అందజేత

హయత్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు తిరుపతిబాయి మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా తొర్రూర్‌కు చెందిన బీమిడి అభిలాష్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దన్నె రాజు, జగన్‌రాజు, నరసింహ, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, రాధ, మాధవి, కొండయ్య, మంజుల, చారి, కృష్ణకుమార్, వెంకటేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బాగ్ ముసారిమో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

చాదర్‌ఘాట్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బాగ్ ముసారిమో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.రమేష్ పరీక్ష కిట్స్ పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా రాసి ఉత్తమ విద్యార్థిగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రెయినర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ, పి.అనిత తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రభావంతోనే యువత పక్కదారి


సదస్సులో ప్రతినిధులు

ఎల్‌బీనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థులు, యువత పక్కదారిపడుతున్నారని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. యువతలో పెరుగుతున్న హింస ప్రవృత్తి కారణాలు, పరిణామాలు, పరిష్కారాలు అనే అంశంపై కొత్తపేటలోని బీజేఆర్ భవన్‌లో బుధవారం రాత్రి సదస్సు జరిగింది. ఈ సదస్సులో విశ్రాంత ఆచార్యులు గణేశ్, ప్రొఫెసర్ జీబీరెడ్డి, రిటైర్డ్ అదనపు ఎస్పీ తిరుపతిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ పెరిక యాదయ్య మాట్లాడుతూ విద్యార్థులు, యువత సరైన మార్గంలో పయనించాలంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదల చాలా ముఖ్యమన్నారు. నక్కా వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏఎస్‌డబ్ల్యూలు గట్టు మల్లు, డాక్టర్ ఎస్‌వీ శివాజీ, అశోక్‌యాదవ్, మేడి నాగరాజ్, జంతుక శంకర్, సతీష్, ఉగ్గు వినయ్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్స్ ఫలితాల్లో 'రేయాన్' విద్యార్థుల ప్రతిభ

మన్సూరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలకు సంబంధించి గురువారం విడుదల చేసిన ఫలితాల్లో రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ స్కూల్ చైర్మన్ జి.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఉన్న సైనిక్ స్కూల్స్‌లో తమ స్కూల్‌కు చెందిన 81 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన వివరించారు. అంతేగాకుండా రాష్ట్రీయ మిలటరీ స్కూల్ (ఆర్ఎంఎస్)కు కూడా నల్గురు విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు.

ఇఫ్తార్‌విందును విజయవంతం చేయాలి

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సమీరుల్లా కోరారు. గురువారం మలక్‌పేటకు వచ్చిన ఆయనకు స్థానిక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గంటల కృష్ణ, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, చక్రపాణి, షకీల్, రాహుల్‌సింగ్, కిషన్‌సింగ్, మదన్‌బాబు, రామారావు, సంతోష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ : ఇన్‌స్పెక్టర్

వనస్థలిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతోనే నేరాల నియంత్రణ జరుగుతుందని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్ సంక్షేమ సంఘం భవనంలో గురువారం కాలనీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దివాకర్ లింగం ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్, స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మహిళల రక్షణకు, దొంగతనాలను అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, కాలనీ అధ్యక్షులు టీవీరావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దివాకర్ లింగం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఏసీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వినోద్, శ్రీనివాస్

ఏసీపీ కాశీరెడ్డికి శుభాకాంక్షలు

మన్సూరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఏసీపీగా నియమితులైన కాశీరెడ్డిని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డప్పు వినోద్, గ్రేటర్ కురుమ సంఘం కార్యదర్శి షైల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సౌత్‌ఈస్ట్ జోన్‌లో చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు

చాదర్‌ఘాట్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో మూడు ఇంటర్ కమిషనరేట్ చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. అక్రమంగా మద్యం, డబ్బులు, ఇతర సామగ్రిని తరలించకుండా నిరంతరం వాహనాలపై నిఘా ఉంచేందుకు జోన్ డీసీపీ జానకీ దరావత్ ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇంటర్ కమిషనరేట్ చెక్‌పోస్ట్‌లు నిరంతరం నిఘా పెడతాయన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను గుర్తించిన వెంటనే తనిఖీలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ చెక్‌పోస్ట్‌లు దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తా, సైదాబాద్ రోడ్‌లో, చాంద్రాయణగుట్ట బండ్లగూడ రోడ్‌లో ప్రత్యేకంగా ఏ ర్పాటు చేసి పోలీసుల నిఘా పెట్టారు.

మలిదశ ఉద్యమకారుడు నారాయణ మృతి

చంపాపేట : మలిదశ ఉద్యమకారుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంపాపేటకు చెందిన మొగిలిపువ్వ నారాయణ(70) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. 2001లో చేపట్టిన రాష్ట్ర సాధన ఉద్యమంలో చంపాపేట డివిజన్‌లో నారాయణ ముందుండి పోరుబాట నడిపించాడు. నాటి ఉద్యమ నేత కేసీఆర్ ఏ పిలుపు ఇచ్చినా రాస్తారోకో, వంటావార్పు, బంద్‌లు, మిలియన్ మార్చ్, కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలను నారాయణ పోలీసుల కళ్లుకప్పి విజయవంతం చేశాడు. కొన్ని నెలల కిందట నారాయణ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. రెండు రోజుల కిందట ఆయన అస్వస్థతకు గురి కావడంతో ఒవైసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నారాయణను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గురువారం ఉదయం చంపాపేటకు తీసుకొచ్చారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ మిద్దెల జితేందర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, పుట్టం పురుషోత్తంరావు, శ్రీపాల్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు, ఉద్యమకారులు నారాయణకు నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబానికి మల్‌రెడ్డి రాంరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి పలువురు కాంగ్రెస్ నేతలు రూ.60వేలు, నల్ల రఘుమారెడ్డి 10వేల ఆర్థిక సహాయం చేశారు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం నారాయణ స్వగ్రామం జడ్చర్లకు తరలించారు.



సమస్యల సుడిగుండంలో వనస్థలిపురం వెల్‌నెస్ సెంటర్

● వైద్యుల కొరతతో ఇబ్బందులు పడుతున్న విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్టులు

వనస్థలిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్త్ (ఈహెచ్ఎస్, జెహెచ్ఎస్)వెల్‌నెస్ సెంటర్‌లో కొంత కాలంగా వైద్యుల కొరతతో ఇక్కడికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందులో భాగంగా వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలోని ఈహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో మొత్తం నలుగురు(ఆర్థోపెడిక్, రేడియాలజిస్ట్, కార్డియాలజిస్ట్) జనరల్ ఫిజిషియన్లకు గాను కేవలం ఒక జనరల్ ఫిజిషియన్ మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. దాని మూలంగా ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో ఈ కేంద్రానికి వచ్చే ఉద్యోగులు, జర్నలిస్టులకు తీవ్ర కాలయాపనతో పాటు ఇబ్బందులు తప్పడం లేదు. అదేవిధంగా ఇక్కడ గతంలో స్కానింగ్ సెంటర్, ఆర్థోపెడిక్, రేడియాలజిస్ట్, కార్డియాలజిస్ట్ సేవలు అందుబాటులో ఉండేవి. క్రమేపి ఇక్కడ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించే డాక్టర్లు, టెక్నీషియన్లు ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడిందని విశ్వాసనీయంగా తెలిసింది. ఇదే విషయంపై సంబంధిత ఉన్నతాధికారులను సంప్రదించగా వనస్థలిపురం వెల్‌నెస్ సెంటర్‌లో సరిపడ వైద్యులు, ఇతర టెక్నీషియన్లు లేకపోవడంతో వెల్‌నెస్ కేంద్రానికి వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురైతున్న మాట వాస్తవమేనన్నారు. ఇక్కడ సరిపడ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఇప్పటికే కలెక్టర్‌కు వినతి పత్రం అందిజేసినట్లు వారు తెలిపారు. త్వరలోనే సరిపడ వైద్యులు, ఇతర సిబ్బందిని ఏర్పాటు చేసి రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు చేపడుతామని వారు తెలిపారు. వెల్‌నెస్ సెంటర్‌లో అన్ని విభాగాల వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పలువురు ఉద్యోగులు, జర్నలిస్టులు కోరుతున్నారు.



వనస్థలిపురంలోని వెల్‌నెస్ సెంటర్


వనస్థలిపురం వెల్‌నెస్ సంటర్‌లో వైద్యుల కోసం వేచిఉన్న వయోవృద్ధులు, జర్నలిస్టులు